క్లుప్తంగా

మహిళలకు మంత్రి సవిత క్షమాపణలు చెప్పాలి

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: అసెంబ్లీ సాక్షిగా మహిళలపై చుల కనగా మాట్లాడిన మంత్రి ఎస్.సవిత మహిళలకు క్షమాణలు చెప్పాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి, సామాన్య కుటుంబాల ఆర్థిక ప్రయోజనాలు కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తే, ఆ డబ్బులతో లబ్ధిదారులైన మహిళలు గంజాయికి బానిసలయ్యారని అసెంబ్లీలో మంత్రి వ్యాఖ్యానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒక మహిళా మంత్రి తోటి మహిళలు గంజాయికి బానిసలయ్యారని ఎలా చెబుతారని నిలదీశారు. గత ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో పేదలు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని సంతోషంగా జీవించేవారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ఉండేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. మహిళలకు మంత్రి సవిత క్షమాపణ చెప్పకపోతే, వారి ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు.

జగనన్న కాలనీ పరిశీలన



జగనన్న కాలనీ పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రాజగోపాల్

హిరమండలం: మండల కేంద్రంలోని పాత హిరమండలం సమీపంలో ఉన్న జగనన్న కాలనీని మండల ప్రత్యేక అధికారి బి.రాజగోపాలరావు శుక్రవారం పరిశీలించారు. కాలనీలో 173 ఇంటి నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ కేవలం 15 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో ఇంటి నిర్మాణాలు ఎందుకు చేపట్టడం లేదని లబ్ధిదారులను ఆరా తీశారు. లే అవుట్‌లో అప్రోచ్ రహదారులు నిర్మించాలని లబ్ధిదారులు కోరారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు. అనంతరం చెత్తద్వారా సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయశాఖాధికారి బి.సంధ్య ఉన్నారు.

భవిత విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పొందూరు: స్థానిక సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో పొందూరు భవిత కేంద్రం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, పండ్లు శుక్రవారం అందజేశారు. సత్యసాయిబాబా జయంతి పురస్కరించుకొని మండల విద్యాశాఖాధికారి రాజారావు చేతులు మీదుగా వాటిని అందజేశారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయురాలు రాధారాణి, ఫిజియోథెరపిస్టు రమ్య ప్రియాంక పాల్గొన్నారు.

పక్కాగా ప్రీ స్కూల్ నిర్వహణ



మాట్లాడుతున్న సీడీపీవో కామాక్షి

సారవకోట: అంగన్‌వాడీల్లో పక్కాగా ప్రీ స్కూల్ నిర్వహించాలని సారవకోట సీడీపీవో హెచ్.కె.కామాక్షి స్పష్టం చేశారు. శుక్రవారం సారవకోట ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో సారవకోట, జలుమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు సమయపాలన పాటించాలని, పిల్లలకు ప్రతిరోజూ ప్రీ స్కూల్ నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. రేషన్ డీలర్ల నుంచి స్టాక్ తీసుకున్న వెంటనే యాప్‌లలో నమోదు చేయాలని సూచించారు. ఇటీవల కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పోషణ వాటిక, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు మంజూరయ్యాయని, వాటిని త్వరగా పూర్తి చేసేటట్లు చూడాలన్నారు. ఆమెతో పాటు సూపర్‌వైజర్లు సుజాత, సునీత, సుమలత ఉన్నారు.

అనాథలకు వస్త్రాలు పంపిణీ



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక చిత్తిరి వీధిలోని సత్యసాయి పెద్ద మందిరంలో అనాథలకు శుక్రవారం వస్త్రాలు పంపిణీ చేశారు. మందిర కమిటీ ఆధ్వర్యంలో వంద మంది పేద మహిళలకు చీర, దుప్పటి, పురుషులకు పంచె, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మందిర కన్వీనర్ నాగేశ్వరరావు, కేఎల్ఎన్ మూర్తి, సూర్యం, రత్నాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆందోళన



గొప్పిలి వద్ద పొలంలోనే కుప్పలు వేసిన ధాన్యం

- భయపెడుతున్న వాతావరణం
- వర్షం పడితే నష్టపోతామని ఆవేదన
- ఇంకా ప్రారంభమవ్వని కొనుగోలు కేంద్రాలు

పాతపట్నం నియోజకవర్గంలో...

మండలం	వరిపంట ఎకరాల్లో	పండిస్తున్న రైతులు
మెళియాపుట్టి	7,741	12,235
పాతపట్నం	8,699	14,726
హిరమండలం	3,364	6,716
కొత్తూరు	10,374	13,914
ఎల్ఎన్‌పేట	4,464	8,487
మొత్తం	34,642	56,078



జోడూరు గ్రామం వద్ద కోతకు సిద్ధంగా ఉన్న వరిపొలం

మెళియాపుట్టి: బంగాళాఖాతంలో అల్పపీడనం, వర్షాల హెచ్చరికలు అన్నదాతను ఆందోళనలోకి నెట్టేశాయి. పంట చేతికంది వచ్చే సమయంలో వర్షాలు పడితే కష్టమంతా నీటిపాలవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పాతపట్నం నియోజకవర్గంలో 34,642 ఎకరాల్లో వరిపంట పండిస్తున్నారు. చాలాచోట్ల వరికోతలు మొదలయ్యాయి. కొన్నిచోట్ల పండిన వరి కోత కోయాలా.. వద్దా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వర్షాలు పడితే కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుందని చెబుతున్నారు. తడిసిన ధాన్యం కొనడానికి మిల్లర్లు ముందుకు రారని, కొన్నా తగినంత ధర రాదని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు.

సూచనలు పాటించాలి

కోతకు వచ్చిన పంటను వెంటనే నూర్పిడి చేయాలి. కోతకు ఇంకా సమయం ఉన్నట్‌లైతే కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి. దీనివలన తుఫాన్ గాలికి పంట చిందరవందరగా పడిపోకుండా ఉండే అవకాశం ఉంటుంది. వర్షపునీరు పొలంలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆరబెట్టి విక్రయిస్తే మద్దతు ధర

పొలాల్లో నీరు నిల్వ అయితే వరికంకులు నేలవాలిపోతాయి. ఇప్పటికే కొన్నిచోట్ల నేలవాలిపోయాయి. చినుకులు పడితే ధాన్యం మొలకలొచ్చే ప్రమాదం ఉంది. 19 శాతం కంటే ఎక్కువ తేమ శాతం వస్తే మద్దతు ధర కూడా పలకదు. రాత్రింబవళ్లు కష్టపడి సాగుచేసి పండించిన పంటకు కనీస మద్దతు ధర రాకపోతే రైతుల పరిస్థితి అగమ్యగోచరం అవుతుంది.

నేలవాలితే నష్టం



వరికోత దశలో వర్షాలు వస్తే నష్టం తీవ్రత అధికంగా ఉంటుంది. అదేవిధంగా యంత్రంతో వరి కోయడానికి కూడా ఇబ్బంది పడతాం. కోతలు పూరయ్యి ధాన్యం మిల్లులకు చేరేవరకు గుబులుగానే ఉంటుంది. వర్షాలు రాకూడదని ఆశిస్తున్నాం.

– పడాల లక్ష్మనాయుడు, పాతమారడికోట, మెళియాపుట్టి మండలం

నేలపాలైతే తట్టుకోలేం



పంట చేతికి అందొచ్చిన సమయానికి ప్రకృతి కన్నెర్ర చేస్తే రైతు కష్టం నేలపాలవుతుంది. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పండించిన పంట మా ఆకలి తీర్చకపోతే ఎలా బతకాలి. వేగంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే ధాన్యాన్ని అమ్ముకుంటాం.

– మదపాల తిరుపతిరావు, పెద్దలక్ష్మీపురం, మెళిమాపుట్టి మండలం

ఆదమరిస్తే అంతే..!



సరుబుజ్జిలి మండలంలోని పెద్ద వెంకటాపురం నుంచి పాలవలస కాలనీ వరకు వరి పొలాల్లో ఉన్న 3 విద్యుత్ స్తంభాలు పూర్తిగా వాలిపోయాయి. దీనివలన విద్యుత్ వైర్లు కిందనున్న వరి పైరును తాకుతూ వెళ్తున్నాయి. వీటికి కర్రలను సపోర్టుగా రైతులు పెట్టారు. ఇదే ప్రదేశంలో రైతులు వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఏమాత్రం వైర్లు వ్యవసాయ కూలీలకు తగిలినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు. – సరుబుజ్జిలి

విద్యార్థుల పాట్లు



ఆధార్‌లో తప్పొప్పులను సరిదిద్దేందుకు ఉద్దేశించిన ఆపార్ నమోదు కార్యక్రమంలో భాగంగా పాతపట్నం మండల కేంద్రంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం స్థానిక కోర్టు కూడలిలో ఉన్న పాతపట్నం సచివాలయం-3లో ఆధార్ సెంటర్‌కు పాతపట్నంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారు విచ్చేసి గంటల కొద్ది వేచి ఉన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమం ప్రారంభమై నెలలు దాటుతున్నప్పటికీ ఇంకా నమోదులో జాప్యం తప్పడం లేదు. – పాతపట్నం

శిథిలావస్థలో వంతెనలు



హిరమండలం మండలంలోని వంశధార ఎడమ ప్రధాన కాలువపై వంతెనలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే చాలావరకు వంతెనల రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా కిట్టలపాడు, పింద్రువాడ కాలనీలకు వెళ్లే వంతెనలు ప్రమాదకరంగా మారాయి. ఈ వంతెనలు నిర్మించి సుమారు 50 ఏళ్లు దాటాయి. వీటిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అందువలన అధికారులు స్పందించి నూతనంగా వంతెనలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. – హిరమండలం

హాట్ బజార్ల వలన ప్రయోజనం



హాట్ బజార్ పరిశీలిస్తున్న పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

సరుబుజ్జిలి: హాట్ బజార్ల నిర్మాణం వలన గిరిజనులకు మేలు జరుగుతుందని సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెన్నెలవలస గిరిజన ప్రాంతంలో నిర్మాణం జరుగుతున్న హాట్ బజార్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ హాట్ బజార్లు ఏర్పాటు చేయడం వలన గిరిజనులు తమ అటవీ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు అవకాశముంటుందని వెల్లడించారు. ఐటీడీఏ పరిధిలో 12 హాట్ బజార్లు మంజూరు కాగా, ఒక్కో నిర్మాణానికి రూ.5 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. జీసీసీ ఆధ్వర్యంలో ఈ హాట్ బజార్లు నిర్వహిస్తామని, వెంటనే నిర్మాణాలు పూర్తి చేయాలని ఇంజినీర్లకు ఆదేశించారు.

రవికుమార్‌కు అభినందనలు



రవికుమార్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్తగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన చింతాడ రవికుమార్‌కు ఆ పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్‌తో పాటు మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు శుక్రవారం అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఆమదాలవలస: ఉపాధి హామీ పథకం ద్వారా బహు వార్షిక పశుగ్రాసాల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ రోణంకి ఆనందరావు తెలిపారు. పట్టణంలోని ప్రాంతీయ పశువైద్య కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంవత్సరం పాటు పశుగ్రాసాల సాగుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆసక్తి ఉన్న పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పశుగ్రాసం సాగు చేయాలనుకునే రైతులు స్థానిక పశువైద్యాధికారులను సంప్రదించాలన్నారు. ఈ సాగుకు ఒక సంవత్సరానికి 10 సెంట్ల విస్తీర్ణానికి రూ.6,599లు, 20 సెంట్లకు రూ.13,197లు, 30 సెంట్లకు రూ.19,795లు, 40 సెంట్లకు రూ.26,394లు, 50 సెంట్ల విస్తీర్ణానికి రూ.32,992లను ప్రభుత్వం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న పాడి రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని స్థానిక పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ సీహెచ్ చంద్రినాయుడు సూచించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జిల్లా పోలీస్ కార్యాలయం పిలుపు మేరకు సంకల్పం పేరుతో రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి గ్రామ సభలు



మాట్లాడుతున్న ఏపీవో యుగంధర్

నరసన్నపేట: ఉపాధి నిధులతో రానున్న ఆర్థిక సంవత్సరంలో వేతనదారులకు పనుల కల్పనకు వీలుగా నిర్వహిస్తున్న గ్రామసభలు శుక్రవారంతో పూర్తయ్యాయని ఏపీవో యుగంధర్ తెలిపారు. 34 పంచాయతీల్లో సభలు నిర్వహించి పనులు గుర్తించామని, గ్రామ సభల్లో తీర్మానాలు చేసి అనుమతులు పొందామన్నారు. శుక్రవారం నరసన్నపేట పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యులు జామి వెంకటరావు, పీస కృష్ణ, వార్డు సభ్యుడు కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పెంపకంతో అదనపు ఆదాయం

కొత్తూరు: చేప పిల్లల పెంపకంతో గిరిజనులకు అదనపు ఆదాయం లభిస్తుందని గ్రామ ఫిషరీస్ సహాయకుడు రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్.రమేష్‌లు అన్నారు. మండలంలోని కంఠమానుగూడ గిరిజన గ్రామంలోని గిరిజనులకు చెందిన చెరువులో, ఐటీడీఏ సబ్ ప్లాన్ నిధుల నుంచి కొనుగోలు చేసిన చేప పిల్లలను శుక్రవారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేప పిల్లలను ఉచితంగా అందజేసినట్లు తెలియజేశారు.



చెరువులో చేప పిల్లలు విడిచిపెడుతున్న దృశ్యం

అభివృద్ధిపై అబద్ధాలు ఎందుకు

- ఎమ్మెల్యే బగ్గుకు వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రశ్న



మాట్లాడుతున్న ఎంపీపీ గోపి తదితరులు

జలుమూరు: పవిత్రమైన అసెంబ్లీలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిపై అబద్ధాలు చెబుతున్నారని జలుమూరు వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. మండలంలోని చల్లవానిపేట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పాగోటి రాజప్పలనాయుడు నివాసంలో ఎంపీపీ వాన గోపి, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, అల్లాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షుడు దామ మన్మథరావు, ధర్మాన జగన్ తదితరులు విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. గత ఐదేళ్ల కాలంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్ జలుమూరు మండలంలో చేసిన అభివృద్ధిని వివరించారు. కొమనాపల్లి వంతెనకు సుమారు రూ.48 కోట్లతో శంకుస్థాపన చేసి ప్రారంభించారని గుర్తు చేశారు. సుమారు రూ.36.70 కోట్లతో జర్జంగి పింద్రువాడ రోడ్డు నిర్మాణం, రూ.10 కోట్లతో లుకలాం - కొమనాపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు, జాతీయ రహదారి నుంచి సారవకోట మండలం బద్రికి రూ.25 కోట్లతో నిర్మాణం, సుమారు రూ.10 కోట్లతో నగరికటకం, మాకివలస, కోదడ్డపనస, బద్రి రోడ్డు ఏర్పాటు చేశారన్నారు. వీటితోపాటు లుకులాం రోడ్డు నుంచి అంధవరం, పర్లాం, తిమడాం వరకు రూ.2 కోట్లతో నిర్మాణం, రూ.60 లక్షలతో అల్లాడ, రామదాసుపేట, జోగులుపేట రోడ్లకు మరమ్మతులు చేయడం జరిగిందని వివరించారు.

జగనన్న కాలనీలు ఒక అద్భుతం

జగనన్న కాలనీల పేరిట గ్రామాల్లో ఏర్పాటైన ఇళ్లు ఒక అద్భుతమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. చల్లవానిపేటలో రూ.10 కోట్లతో పూర్తిస్థాయి కాలనీకి కావాల్సిన నీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలతో పాటు ఇంకుడు గుంతలు సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలం మొత్తం 35 పంచాయతీల్లో సుమారు 600 ఇళ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. అలాగే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టామని గుర్తు చేశారు. అసెంబ్లీలో అబద్ధాలు చెప్పడం మానుకొని, సూపర్ సిక్స్ అమలుపై దృష్టి సారించాలని కూటమి నాయకులకు హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పైడి విఠలరావు, పి.ముసలి నాయుడు, పొన్నాడ విజయ్, పంచిరెడ్డి రాజారావు, వాన నాగేశ్వరరావు, సీపాన మోహన్‌రావు, కల్యాణం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



రామారావు మృతదేహం

పాతపట్నం: మండలంలోని కొరసవాడ పంచాయతీ శివరాంపురం గ్రామానికి చెందిన వృద్ధుడు సింగిరి రామారావు (73) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపురం గ్రామానికి చెందిన సింగిరి రామారావు ఈనెల 21వ తేదీన మెళియాపుట్టి మండలం సుందరాడలో తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. అదే రోజు రాత్రి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా, పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలోని మహేంద్ర కళాశాల దిగువన మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయలపాలయ్యాడు. స్థానికులు 108 సాయంతో పాతపట్నం సీహెచ్‌సీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ తరలించారు. శుక్రవారం ఉదయం రిమ్స్ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అయితే కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ రామారావు మృతి చెందాడు. మృతుడికి భార్య గౌరవమ్మ, కుమారులు వరద రాజులు, కేశవరావులు ఉన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ



పుస్తకాలు అందిస్తున్న మిశ్రో

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న గ్రంథాలయానికి విజ్ఞానాన్ని అందించే పుస్తకాలతో పాటు విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను అందించినట్లు లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎంకే మిశ్రో తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ నిర్వాహకులకు పుస్తకాలను అందజేశారు. గ్రామీణ గ్రంథాలయాలు ఏర్పాటు, వాటి అభివృద్ధి కోసం అందరు ముందుకు రావాలని కోరారు. ఆయనతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో ఇద్దరు అరెస్టు

సారవకోట: మండలంలో శుక్రవారం 18 మద్యం బాటిళ్లతో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కృష్ణారావు తెలిపారు. సారవకోట సమీపంలో సారవకోట గ్రామానికి చెందిన రగుతు అప్పారావు నుంచి 8 మద్యం బాటిళ్లు, అలాగే బొంతు సమీపంలో కె.జగ్గారావు నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వీరిద్దరినీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, పాతపట్నం ఎక్సైజ్ శాఖల ద్వారా పట్టుకున్నట్లు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడి



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

హిరమండలం: మండలంలోని రుగడ, ఎగువ(పెద్ద) రుగడ గ్రామాల పరిసరాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న నాటుసారా స్థావరాలపై శ్రీకాకుళం ఎక్సైజ్ ఎస్ఐ బి.అప్పారావు, కొత్తూరు ఎస్ఐ బీహెచ్ కిరణ్ మునీశ్వరిలు పోలీసు సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా 1,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే 80 లీటర్లు సారా సైతం పారబోసి, నాటుసారా తయారు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా సారా తయారీ, గంజాయి, మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'విజయవంతం చేయండి'



యూటీఎఫ్ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నరసన్నపేట: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న యూటీఎఫ్ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని సంఘం ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎంఆర్‌సీ వద్ద జిల్లా మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25వ తేదీల్లో మందస మండలం హరిపురంలో జిల్లా మహాసభలు నిర్వహిస్తామన్నారు. నరసన్నపేట ఎంఈవో శాంతారావును సభలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు దమయంతి, సుధీర్, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కొత్తూరు: మండల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎండీ అమీర్ అలీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన ఎస్ఐ ఏంఏ అహ్మద్ ఇంటెలిజెన్స్‌కి బదిలీపై వెళ్లారు.